సత్ప్రవర్తన ఫలము.

ఒక కల్పిత కథ.

నారాయణరావుగారు చెన్నపురిలో నికోల్సను కంపెనీవారి వద్ద ముఖ్యఇంజనీరుగాను, మ్యానేజరుగాను యున్నారు. ఈయన రెండువందల రూపాయలు జీతము సంపాదించుచున్నాడని పేరేగాని పట్టుమని పదివరహాలసొమ్మయినను భార్యమెడలో లేదు. నలుగురు బిడ్డలలో నొకరిచేతికైనను ఒకబంగారపు మురుగున్నట్లు కానుపించదు. అయితే 200 రూపాయల జీతమేమగుచున్నదని, చదువరీ, నీవడుగవచ్చును. పట్టణములో సంసారపోషణమునకై సొమ్ముపోగా మిగిలినదంతయు నొకనూతనయంత్రమును జేయుటకై గడచిన ఆరుసంవత్సరములనుండియు వ్యయముచేయుచుండెను. పైగా అప్పుగా గొంతసొమ్మును మార్వాడీలవద్దనుండి పుచ్చుకొనుచుండెను. ఈవడ్డీలను తీర్చుట కూడ కష్టతరముగానుండెను. ఈయనభార్య కాపురమునకు వచ్చినది మొదలు యీరోజువరకును ఒకకాసెత్తుసొమ్ము చేయించిపెట్టుమని పెనిమిటిని పల్లెత్తియడిగి యెఱుగదు. ఇంట్లో సొమ్మున్నను లేకున్నను నెమ్మదిగా సంసారమునడిపించు భర్తకు నిజమైనసహధర్మచారిణియై మెలంగుచుండెను. గృహము సంపదలతో దులతూగకున్నను శాంతి కాటపట్టయి యుండుటచేతనే యెట్టిబాధయునులేక గడచిన ఆరుసంవత్సరములనుండియు నారాయణరావు నెమ్మదిగా దమయంత్రమును నిర్మించుటకు శక్తిగలిగియుండినది. ఈయంత్రమేదియన నాలుగురంగులను ఒక్కకాగితముపై నొకేపర్యాయము ముద్రించునటు చేయుట. ఈకథజరిగిన నాటిరాత్రి తననూతన నిర్మాణముయొక్క ప్లానులను దాను వేలకొలదిరూపాయలను వ్యయముచేసి నిర్మించుచున్న యంత్రమున్న గదిలో బెట్టుకొని "యీ రెండులోపము లేల రావలయునుచెపుమా. ఆరుసంవత్సరములు నానాశ్రమలుపడి యింతవరకు దీనిని దెచ్చితిని. ఈరెండులోపములను నివారించితినేని నేను లక్షాధికారినే. ఈపాడు దారిద్ర్యమువదలిపోవును. ఏమో, జయమును నా కండ్లతో జూచెదనో లేనో!! నాప్రాణము యీ యంత్రమువద్దనే పోవలసియున్నదని మూడుపంక్తులతో ముఖముమీద బ్రహ్మవ్రాసియుండగా నీరెండులోపముల నెట్లునివారింపగలను. ఆరుమాసములనుండియు నాప్రాణములను దీసివేయుచున్నదే" యని మనసులో ననుకొనుచు నిట్టిపనికై దిగినందునకు దన్ను దాను నిందించుకొనుచు, నొక్కొకప్పుడు ఆశలుపుట్టుచుండగా జయించలేకపోదునా యని ధైర్యము దెచ్చుకొనుచు నారాయణరావు ప్లానులవంక జూచుచుండిరి.

ఇంతలో బయటివాకిలితలుపు నెవరో తట్టగా, "జానకీ, ఎవరో తలుపు తట్టుచున్నారు. తీయుము" అని నారాయణరావుగారనిరి. జానకమ్మగారు తలుపు దెరువగానే వెంకయ్యగారు లోనికి వచ్చి నారాయణరావుగారున్న గదిలోనికి వెళ్ళిరి.

"అయ్యా, నారాయణరావుగారు, వేళగానివేళ వచ్చినందునకును, మీపనికి భంగమును గలిగించినందునకును మన్నింపవలయు" నని వెంకయ్యరుగారు ముందుగా క్షమాపణను వేడుకొనిరి.

"అయ్యో, అలా అనకండి. మంచివేళనువచ్చినారు. పనిభంగము కాలేదు. తమరేపనిమీదవచ్చినారో దయచేసి చెప్పవలెను" యని నారాయణరావుగారనిరి.

"నాకొకచిన్నపని మీవలన కావలసియున్నది.

"ఏమిటది".

"ఆ- ఏమిలేదండి. మీరుదయయుంచినారంటే అయిపోతుంది.

"అదేమిటో చెప్పండి, అయ్యగారూ."

"ఇప్పటికి మీముద్రాక్షరశాలలో పనిఎక్కువగానున్నది. పుచ్చుకొన్న కంట్రాక్టులు చాలానిలిచియున్నవి. పయిగా డిల్లీదర్బారు సంచికలను మూడులక్షలు అచ్చువేయుదురట. ఇప్పుడు నాలుగుమాసములక్రిందట మీకు గవర్నమెంటువారు జనాభాలెక్కలను ముద్రించుటకయి యిచ్చిన 1,50,000 రూపాయలపనిని మా వెంకటాచలం శెట్టిగారి ముద్రణాయంత్రశాలలో నచ్చువేయించవలయునని మా విజ్ఞాపనము"

నారా:— అది నాచేతిలో లేమున్నది. నాయజమానుని వెళ్లి చూడండి."

వెంకయ్యర్;— అంతమాత్రము నాకు తెలియక నా మీతావునకువచ్చినది. ఉన్నసంగతేమో చెప్పెదను వినండి. మీతో ఆలోచించనిది మీయజమాని ఒక్కపనిఅయినను చేయడు. మీరుచెప్పిన మాటను ఆయనదాటిపోడు. గట్టిగా యీపనిని మాకిప్పించవలసినదని అడుగుటకై నేను పంపబడితిని. మనమందరము వ్యాపారములనువదలి డబ్బుసంపాదించుటకయి వచ్చినట్టివారమే. ఈపని యుచితముగ మీరుచేయవచ్చు. ఇన్నేండ్లనుండియు మీభార్య కుచేలుని భార్యవలె గనపడుచున్నది. కాని ఒకమంచినగయయినను చేయించియుండినను ఆమె యున్నట్లు కానుపించదు. పాపము, ఆమెను చూచినప్పుడు జాలివేస్తుంది. ఎందుకు!! ఇంతకుముందామె తలుపుతీసినప్పుడు ఆమె ముఖమునుజూడగానే నాకు ఎంతోవ్యసనమయినది. ఇకమీపిల్లలకు నగలట్లుండగా మంచిగుడ్డలైనాయున్నట్లు కనుపించదు. మీరు గృహస్థులు. భార్యను బిడ్డలను హోదాకుదగినట్లుంచవలయుగాని యీస్థితిలోనుంచుట మంచిదికాదని నాతలంపు. మనమారుసంవత్సరములనుండి ఒకరిమొగమొకర మెల్లప్పుడుచూచుచున్నాము. కాబట్టియును, మీపొరుగున యుండబట్టియును ఇంతస్వతంత్రించి మాటలాడినాను. తప్పులున్నచో క్షమింపవలసినది."

"ఉపన్యాసము పూర్తియయినదండి వెంకయ్యరుగారు! ఇంకేమయినయున్నదా" యని పైమాటలను వినలేక వినుచున్న నారాయణరావుగారు ఆగ్రహముతోగూడిన అసహ్యముతో బలికిరి.

"ఇంక ఒక్కమాటమాత్రమేనండి. మీశ్రమవ్యర్థపోదు. ఈపనిని మాకిప్పించినయెడల ఏమయిన అక్కయ్యగారినగలకు......"

నారా:— ఏమిటి! లంచమా!!

వెం:— ఎబ్బెబ్బే కాదండి. నేనామాట అన్నానా. ఇప్పుడు ఇంతకాలమునుండి మీయజమానివద్దపనిచేసి మంచి నమ్మకముతో ఆయనవద్ద సంపాదించుటకై పడినశ్రమకు ఏదోయొక ఫలముండవలయునా లేదా. ఆఫలమును మావల్ల పుచ్చుకొనమన్నానుకాని, అబ్బే లంచమన్నానటండి.

ఈమాటలను వినిన నారాయణరావుగారికి కాళ్ళమంట తలకెక్కినది. "చెన్నపట్నములోజేరి చమత్కారముగా మాట్లాడటం నేర్చినావయ్యా. ఇంతకాలమునుండి నన్ను జూచియు నాస్వభావమును గనుగొనలేకపోతివి గదా" యని యనుచు తలుపులను దెఱచెను. వెంకటఅయ్యరుగారికి సంభాషించుట మర్యాదగాదని ఎఱిగి కుర్చీమీదనుండిలేచి "నారాయణరావుగారు మూడువేలరూపాయలు ఒక్కదినములో నెవరికిని దొరకవు సుమండీ" యనుచు తలుపువద్దకువెళ్ళి "రేపుసాయంకాలము తిరిగి తమదర్శనమును జేసుకుంటాను" అని చెప్పి వెళ్ళిపోయెను.

వెంకటఅయ్యరు కడపటవనివెళ్ళిన "మూడువేల రూపాయలు ఒక్కదినములో నెవరికిని దొరకవుసుమండీ" యను మాటలు నారాయణరావుగారి మనస్సులో జొరబడి యమితముగ బాధపెట్టుచుండెను. అయ్యరురాకముందు యంత్రమువద్ద విసుగుజెందుచు అనుకొనిన మాటలు ఆరాత్రి నారాయణరావుగారికెంత మనోవికారము గలిగినది చూపుచున్నవి. ఇప్పుడీయన తనమనస్సులోనిట్లు తలపోయుచుండెను. "ఈయంత్రమువలన నేనుభాగ్యవంతుడనవుదునో కానో కాని నాభార్యాబిడ్డలనుమాత్రము చంపుచున్నాను. వారికి కట్టుకొనుటకయిన మంచిగుడ్డలను లేకుండజేయుట బహుపాపము నాభార్య పతివ్రతాతిలకమగుటజేసి నాయాటలు సాగుచున్నవి. కలహస్వభావముగల స్త్రీయయియుండినయెడల నాకీయిల్లు నరకముగ నుండునట్టిది. చెలిమియుంచినని శక్తితో నములజూచుట మంచిదికాదు. దానిస్వభావము మంచిదని ఇన్నికష్టముల పాలుచేయరాదు. ఎంతమందిలంచాలుతిని బాగుపడుటలేదు. నేనుతిన్నయెడ నుంటానిగదా! దేవుడేమయిన సహాయముచేసి నాడందమా ఆగియుండలేదు. ఇదిగో నాప్రాణములను తినుచున్న పాడుయంత్రము దీనినిబాగుచేయుటకు దేవుడు బుద్ధినియ్యరాదా? ఒక్కనెలలో భాగ్యవంతుడను కాగలనే.... నానోటినుండి ఒక్కమాట మూడువేలరూపాయలువచ్చిచేతిలో రాగలవు. అయ్యో! ఎంతపాపపుతలంపు తలంచుచుంటిని. రూపాయలు తీసుకొని యజమానితో సిఫారసు చేయుటకయి ఏమిముఖముపెట్టుకొని వెళ్ళగలను. సొమ్ముతినిన సాక్షిని వాడెంత 1 50,000ల రూపాయలపనిని పాడుచేసుకొనివచ్చినను బాగుగానున్నదని చెప్పవలసివచ్చునే. అటుపైన గవర్నమెంటులో నాయజమానికిమాటవచ్చినచో? ఛీ, ఈపాడుపనిని చేయరాదు. కాని... మూడువేలరూపాయలా? మార్వాడీలబాధను 1500 రూపాయలిచ్చి తీర్చుకొనవచ్చునుగదా? ......తక్కిన 1500 వందలతో పిల్లలకు తల్లికి వెయ్యిరూపాయలకు నగలుచేయించవచ్చును. మిగిలిన అయిదువందలు యంత్రముమీద తిరిగి తగులబెట్టవచ్చును. వ్యర్థాగా ఎందుకు పోగొట్టుకొనవలె!! ఇంత సొమ్మును... ఛా, యీరోతసొమ్మునుఏలతినవలయును. అటువంటప్పుడు రాత్రికన్నపుదొంగకును నాకును ఏమిభేదముండును ఎటులనిష్కల్మష హృదయముతో నాబిడ్డలను నాపెండ్లామును ఇకముందుచూడగలను" ఇంకననేకవిధములుగా రావుగా రూహించుకొనుచుండగా రాత్రి 1 గంటలు కావచ్చెను. అప్పుడు జానకమ్మగారు గదిలోనికి వచ్చి భర్తను భోజనమునకు బిలిచెను.

వంటయింటియందు నారాయణరావుగారు భుజించుచుండగా మెల్లగా జానకమ్మ ఇట్లనెను. "ఎల్లుండి సంవత్సరాది పండుగ క్రొత్తచొక్కాలకును, లాగులకును, పరికిణీలకును బిడ్డలునన్ను వారముదినములనుండియు వేధించుచున్నారు. దీపావళిపండుగకని, సంక్రాంతికని ఆశలుపెట్టినాము. ఈసారివాళ్లు ఊరకయుండునట్లులేదు. ఇప్పుడు మీతో చెప్పిలాభములేదు. కానిఏలాగయిన కొద్దిగానప్పుపుచ్చుకొని గుడ్డలువాండ్రకు దెత్తురా"

"నీకుమాత్రమేమున్నవే. నీకుకూడా మంచిచీరె లొకటిరెండు తీసుకొనిరావలసినదే" యని జాలిగుండెతో రావుగారనిరి.

"నాకులేకపోతే నేమిలెండి. ఉన్నవిచాలును లెండి. ఎందుకు వ్యర్థముగా సొమ్ముఖర్చు"

"నీకు అసలున్నవేమిటి. మంచిచీరలు లేనేలేవు"

"నాభర్త నాబిడ్డలు నాకుసొమ్ములు చీరలుసర్వమును. వారు హాయిగానుండినచో నాకన్నియుగలవు. వారు సుఖముగాలేకున్నచో నన్నియుండియు నాకులాభములేదు." అనిజానకమ్మగారనిరి.

నారా:—నిజముగా నీవునాపాలిట దేవతవే. నేనుపెట్టుచున్నకష్టములను నీవుకాబట్టి యోర్చియున్నావు.

జాన:—అట్లుభరించుట నావిధి. నేనుఅర్ధాంగినికాదా. నాభర్తయొక్క యుత్తమకార్యమునకయి శ్రమపడుచున్నాడని గుర్తెఱిగినప్పుడాయన నన్నివిధముల ప్రోత్సహించుట నాపరమకర్తవ్యమని నాఅంతరాత్మ ప్రబోధించినది.

నారా:— ఆకార్యములో జయమందలేకపోయినచో

జాన:—అదిమనచేతిలోలేదు. ఫలమునిచ్చుట పరమేశ్వరునిది- కష్టముమనది.

నారా:— బ్రతికినన్నినాళ్లు మనకుకష్టమయినచో నెట్లుభరించగలము?

జాన:—మనదికష్టమని నాకుతోచదు. సొమ్ములును, మేడలును, బండ్లును లేకపోవుట ఒకకష్టమయినచో, గంపెడుబిడ్డలులేకని

నిలుచుండుటకు నీడయు, దినుటకన్నము లేక పక్షులవలె అవస్థపడుచుండు భార్యాభర్తలదుఃఖము ఎటువంటిదో చూడుడు.

నారా:—ఒకవేళ ఈయంత్రము ముందర నేను చచ్చిపోయినచో నీవును ఆట్టిదుఃఖముల పాల్పడుదువేమో?" యనికండ్లకు తడిపెట్టుకొనెను.

జాన:—రామరామ అలాఅనకండి- మీయెదుటను బిడ్డలయెదుటను నిండుపసుపుకుంకములతో దాటిపోవలయునని దినదినముదేవుని ప్రార్థించుచున్నాను.

"డబ్బుకేమయిన ప్రార్థించుచున్నావా"

"ఏమిటి. ఈవేళ మీకు డబ్బుపిచ్చపట్టినది. ఇదియెప్పుడును లేదు. అదివాండ్రకుండవలసినది. మగవారిని పట్టుకున్నదేమి"

"జానకీ, నీతో నేను నిజము చెప్పదగలనా, నీవు యీదౌర్భాగ్యునికి మొట్టమొదటినుండియు భార్యవే కాకమంత్రివి"

అని వెంకయ్యయ్యరుతో జరిగిన సంభాషణమును, మార్వాడీవాండ్రు డబ్బుకై పెట్టుచున్న బాధలను సవిస్తరముగాజెప్పి "ఆయారువేలు తీసుకొని ఒక్కసారి విముక్తినొందవలయునని పాపిష్టిమనోవికారము కలిగినది. నీయుద్దేశమేమి?" యని నారాయణరావుగారు భార్య నడిగిరి.

ఈమాటలను వినిజానకమ్మ కండ్లవెంబడి నీరుబొటబొట కారుచుండగా "నాకొఱకును, బిడ్డలకొఱకును, యీలంచము పుచ్చుకొననని వాగ్దానము చేయుడు" యనుచు భర్తయొక్క రెండుకాళ్లును పట్టుకొనెను.

ఈమాటలనువినిన నారాయణరావుగారు తానుగొప్పపాపినని యూహించుకొని భార్యముఖమును జూచుటకిష్టములేక పాదములనుండిఆమెను ఎత్తుటకును జేతులురాక నేడువమొదలుపెట్టెను. ఇంతలో జానకమ్మగారు ధైర్యమును దెచ్చుకొని లేచి "ఈయుద్యోగముపోయినను, మార్వాడీల బాధలవలన మనకున్న చెంబుతప్పెలలుపోయినను, మనము నాలుగువీధులకు నలుగురుబిడ్డలనుబంపి ఎత్తుకొనితిందము కాని యీపాపకార్యమునకు సాహసించనని చేతిలో చేయి వేయవలసినది" అనిచేయిజాచెను. నారాయణరావుగారు అన్నదేవతసాక్షిగా నేనాపాపకృత్యమునకొడిగట్టనని ప్రమాణముచేసి ఎంగిలిచేతినే భార్యచేతిలో వేసిరి. నారాయణరావుగారు తమజీవితములో నొకగొప్ప దుష్కృత్యప్రేరేపణమును సతీతిలకమగు జానకమ్మగారి సహాయమువలన జయింపగలిగెను. భార్యలుభర్తలకు జేయవలసిన యుపకారమంతకంటె ఎక్కువయుండునా.

మరునాడుదయమున నిదురనుండి లేవగనే నిత్యకృత్యముగ యంత్రనిర్మాణమునకు నారాయణరావుగారు గడంగిరి. మనసు నొందోళపఱచిన యొకపెద్దసంకటము తొలగిపోయినందున ఆయనయూయదయమున పదిదినములు రాజుగారి రాకకయి సెలవు లొసంగబడినప్పుడు బడిపిల్లలెంతయానందముతో నాటలాడుచు గాలమునుబుచ్చుచుండిరో నంతయుల్లాసముతో యంత్రముతో నాటలాడుచుండెను. ఒకచక్రమును యంత్రముయొక్క అడుగుభాగమునుండితీసివేసిదానిస్థలములో మరియొకదానిని బెట్టిరి. మరియొకచోట నాలుగుబెజ్జములనుపొడిచి అందులో వేర్వేరయిన సామానులనుంచి యంత్రమును త్రిప్పగా నదితిరుగుటకు ప్రారంభించెను. ఈయంత్రమిట్లు తిరుగుటనుజూచి తననోముఫలించినదని నారాయణరావుగారు ఆనందపరవశుడై "ఓజానకీ, జానకీ, ఓజానకీ, మనము భాగ్యవంతులమయినాము దమ్మరమ్మా అనిగడిలో గంతులువేయుచు అఱచుచుండెను. ఏయంత్రముపడి ఏఅపాయము వచ్చినదోయని కేకలను అంట్లుతోముకొనుచున్న జానకమ్మగారువిని ఏడ్చుచు పరుగెత్తుకొనివచ్చి "ఏమండి. ఏమిసంభవించినది" అనియడిగెను.

"ఏమనబోదుము- నాజననము సాఫల్యమునొందినది. యంత్రము నడచుచున్నది. ఈరెండును బహుతేలికయయినపనులు. అనుమానములనుండి నన్నెంతశ్రమపెట్టినవో చెప్పుమా" యనిరావుగారనిరి.

దేవుడుమనలను బరీక్షించుటకయి యీకష్టములను గల్పించియుండవచ్చును. వెంకయ్యయ్యరును నిజముగా మనశక్తినిపరీక్షించుటకయి దైవముపంపినాడని నాదృఢవిశ్వాసము. ఆపరీక్షలో దేరితిమి. అందుకుమెచ్చి మనలను రక్షించినాడు. ఆహా, ఏమి!! ఆపరమేశ్వరునికటాక్షము యనుచు ఆనందాశ్రువులను జానకమ్మ రాల్పదొడంగెను.

ఇంతలో దలుపు నెవరోతట్టిరి. జానకమ్మగారు తలుపుతీయగా వెంకయ్యయ్యరుగారు ప్రవేశించెను. తనిఖీకివచ్చినాడనుకొని "ఏమండోయి చేతిలో చేయి" అనిరాత్రిప్రమాణమును పెనిమిటికి జానకమ్మ జ్ఞాపకమునకుదెచ్చెను.

వెంకయ్యరు "నారాయణరావుగారు ఏమాలోచించినారు. ఒక్కమాటమాత్రమేనండి. మీకులాభము. మేమును బాగుపడగలము. పనికాకపోయినను దిరిగి సొమ్ముమీరీయవద్దులెండి. నీబిడ్డలు, నీపెండ్లామయొక్క స్థితియునుజూచి సరిఅనవయ్యా, వెఱ్ఱిబ్రాహ్మడా"

"నాభార్యాబిడ్డల పేరెత్తినావు. కనుకనే వారికొఱకయినను నీసొమ్మును పుచ్చుకొనను. నీవుస్నేహపూర్వకముగా లంచముపేరెత్తకుండియున్నచో నాశక్తికొలది యత్నించియుందును. ఇప్పుడో నేచేయవలసినదేమియులేదు"

"అయ్యో, నామాటలు నాకేవిషమయినవే. లంచము పుచ్చుకొనవద్దులెండి" యని వెంకయ్యరనెను.

నారా:— ఆకాలము మించిపోయినది. నీవుస్నేహితమునకును దగినవాడవని నాకుదోచదు.

వెంక:—అయితే నేనుదొంగపిల్లికాయను- నీవుసత్యసంధుడవుకాబోలును" అనికోపము నభినయించుచు నిటునయిన రావుగారు మార్గమునకువత్తురేమోనని "ఎవడో ఎక్కువ సొమ్మిచ్చెదనని యనియుండవలయును. అందువలన నింతబిగింపుగానున్నది" అనిపరిహసించెను.

ఈమాటలు నారాయణరావుగారి క్రోధమును గలిగించినను బయటికి గనుబఱచక నీచులస్వభావమే యిదియని ఎఱింగినవాడై "వెంకయ్యయ్యరుగారు నాచరిత్రమును కొంచెము చెప్పెదను వినుడి. అప్పుడ

యినను నాస్వభావము కొంతతమకు బోధపడకపోదు. అని రావుగారిట్లు చెప్పదొడంగిరి. "నేను యీరాజధానిలో నెల్లూరుజిల్లాలో నొక కుగ్రామమందు జన్మించితిని. నాతండ్రి నియోగియయినను మొట్టమొదటినుండియు వేదకర్మానుష్ఠానపరుడు. శుద్ధశ్రోత్రియుడు. కొంత భూజీవనముకలవాఁడు. నాతల్లివంటి సుస్వభావురాలు ఈప్రపంచమునందు పుట్టియుండదనినను అనవచ్చును. ఆమెయే మంచిగుణములను చిన్నప్పటినుండియు నాకుపట్టుపడునటుచేసినది. నేను ఎఫ్ఏ ప్యాసయి ఇంజనీయరింగు పరీక్ష ప్యాసయినతరువాత విచిత్రముగా నాతండ్రి గవర్నమెంటుద్యోగములో ప్రవేశింపవలదని నిషేధించెను. నాతల్లియునందుకొప్పుకొనెను. కారణము మాగ్రామములోబుట్టి ఫారెస్టుశాఖలోబని చేసి లంచములుతినినాడని రంగారావుకు 5 సంవత్సరములు కఠినశిక్ష విధింపబడుట. సర్కారునౌకరిలో లంచములుతినుటకనేక అవకాశములుండునని వారిభయము. మృతినొందునప్పుడుగూడ, నాయనా! నారాయణ!! గవర్నమెంటుద్యోగము చేయవలదని నాతల్లి చెప్పిపోయెను. వారియభిప్రాయములు మనకువిపరీతముగ దోచవచ్చును. వారుపూర్వకాలపు మనుష్యులేకాని శుద్ధప్రవర్తనమునందు వారు మనకుదీసిపోరు" అనగా వెంకయ్యరు ముఖము చిన్నజేసుకొనెను. "నాతండ్రి మూడుసంవత్సరములక్రితము నేనొకపునర్వివాహము జేసుకొనిన దంపతులకు నాయింట్లో విందుచేసితినని వసలివెళ్లెను. అయినను నేనొక్కడనే కుమారుడనయినను యీదినమువరకు నాకుత్తరము వ్రాయలేదు. నేనును ఊరకుంటిని. ఈరోజువరకొక్కయుత్తరము వ్రాసితినేని నా డి నేయిగాను రెండువేలయినను బంపగలను. కాని నన్నుకొన్ని నప్పటికిని వ్రాయను ఇక నా భార్యనుగురించి నేనుపొగడుట అనవసరమయినను నాతల్లిదండ్రులకంటె నాకు నాభార్యయే ఎక్కువయని నేననుటచే నేను అవివాహిని అగౌరవపరచుట కాదు. నాకీభార్యలేనియెడల నాబ్రతుకేమయియుండునో? నా భార్యకు నగలులేవు. బిడ్డలకుమంచి బట్టలులేవు. ఇంటియందు మంచి మంచి పెట్టెలు, కుర్చీలు, తివాచులులేవని నీవు నిన్న యంటివి. నా రెండువందల రూపాయలజీతములో నీవస్తువు లన్నియు నావద్దనుండును కాని ఒక యంత్రనిర్మాణము కొరకై సొమ్ము వ్రయము వేలకువేలుచేసి ఆరుసంవత్సరముల నుండియు శ్రమపడుచుంటిని. ఈయంత్రమును ఏలాగుననయితేనేమి నిర్మించితిని. [illegible] విధములగు పత్రికలను ముద్రించుటయందు నానిర్మాణము ప్రపంచమునందంతయు మార్పును కలుగజేయుననిన నేనుపిచ్చివాడనని తలంపకుము. ప్రతిముద్రాక్షరశాలయు నాయంత్రమును కొనితీరవలయును. ఇంతవరకొకరంగు చొప్పున ఎన్నిరంగులు ముద్రింపవలయుననిన అన్నిపర్యాయములు ముద్రింపవలయును. ఇప్పుడన్ననో నాలుగురంగులొక్కపర్యాయము ముద్రింపవచ్చును. నాయంత్రములు లక్షలకు లక్షలు విక్రయమగును. నేనుకోటీశ్వరుడను కాగలను. ఈ నిర్మాణము నాకుకలిగించిన మనోబాధ, నిద్రలేనిరాత్రులు, విశ్రాంతిలేనిపగళ్లు, ఇంటిలో దారిద్ర్యము, వీటినన్నింటిని ప్రస్తుతము వర్ణింపజాలను. నీవిచ్చెదనన్న 3000 రూపాయలు ఆశనుబుట్టించినవి. కాని నాభార్య నాపాలిట దేవతయయి నన్నంగీకరింపకుండ జేసినది. ఇది సంక్షేపముగా నా చరిత్రము. కాబట్టి ఎవడో యీకంట్రాక్టుకయి నాకెక్కువ లంచమిచ్చునని నేనిట్లుచేసినానని తలంపవద్దు"

ఈచరిత్రను వినిన వెంకటఅయ్యరు కొకవిధమయిన చింతయును లజ్జయును గలిగినవి. అయ్యో, యిటువంటి సద్బ్రాహ్మణుని ప్రతిమను చెడగొట్టుటకయి యత్నించిన దుర్మార్గుడ ననియనుకొని "చిన్నప్పటినుండియు నేనువర్తకములోని పురుషుడను. సజ్జనసాంగత్యము చేసినవాడనుగాను. మనచెన్నపట్టణములో నేదోయొక విధమున ధనమార్జించుచు- సుఖముగానుండుము. వర్తకమునందు యున్నతాదర్శములకు స్థలము కాదు, అవియున్నవాడు వర్తకుడును కాజాలడని అనువారే కాని మీవంటివారు లేరు. ఈనాటి మీపవిత్రచారిత్రమును విని ధన్యుడనయితిని. మీభార్యాగారిని గురించి మీరుచెప్పిన యామక్కువలన ఆమె శీతాదేవివంటిదని నేను తెలుసుకొనినాను. ముందు మీయనుగ్రహమువలన నేను సత్ప్రవర్తనుడను కావలసియున్నదేమో. నాకొక్కటి కావలసియున్నది. అది నాకనుగ్రహించితిరేని నేనుకృతార్థుడను.

వెంకయ్యరు యొక్క మనస్సు యీవిధముగా దిరిగిపోవునని నారాయణరావుగారనుకొనక "ఏమిటది" అనియెను.

"మీయమూల్యమయిన స్నేహితము. దానికి నేను పాత్రుడనని మీయెదుట నిన్నటిరాత్రి నాప్రవర్తనమువలన జెప్పుకొనలేను. కాని ముందుయోగ్యుడనని నిరూపించగలుగుదును" అని అయ్యరుగారని నారాయణరావుగారితోపాటు ఆయనయంత్రమును పరీక్షించి దీసినిరిజిస్టరి చేయించుటకును, యంత్రములను నిర్మించుటకును ఎంతపెట్టుబడి కావలయునని విచారించెను. నారాయణరావుగారు దక్కువలో తక్కువ యేబదివేలనిరి. "వెంకటఅయ్యరును మీరునమ్మవలసినది. ఈధనమును తీసుకొనిరాకపోలేదు." అని చెప్పి అయ్యరుగారు నారాయణరావుగారికి నమస్కరించి సెలవుపుచ్చుకొని వెళ్లెను.

రేపటిదినము సంవత్సరాదిపండుగ. బిడ్డలకవియివికొనుటకయి ఎక్కడనుండిసొమ్ము తెచ్చెదనాయని నారాయణరావుగారాలోచించుచుండగా నొకతంతివార్తవచ్చెను. తొందరతో రావుగారు దానిని దెఱచి చదివిరి "పండుగకు వచ్చుచున్నాము. రేపుయుదయము మూడున్నర గంటలబండికి స్టేషనుకురావలసినది. నూరురూపాయలు టెలిగ్రాఫుమనిఆర్డరుద్వారా పంపితిని — తండ్రి"

అని వ్రాయబడియెను. మూడుసంవత్సరములయిన పిమ్మట దండ్రివచ్చుచున్నాడని రావుగారికిని, తాతయ్య వచ్చుచున్నాడని బిడ్డలకును, మామగారు వచ్చుచున్నారని జానకమ్మగారికిని కలిగినసంతోషమింతింతకాదు. పోస్టుమేన్ నూరురూపాయల మనీఆర్డరు పుచ్చుకొని యింతలోవచ్చెను. బిడ్డలకును, వారితల్లికిని కావలసిన బట్టలను ఇంటిసామగ్రిని నారాయణరావుగారుకొని పండుగదినముదయమున రయిలుకువెళ్లి ప్రియజనకుని యింటికి దోడ్తెచ్చిరి. రామయ్యపంతులుగారు తనకుమారుని మనుమలను, మనుమరాండ్రను, సుగుణరత్నమగు కోడలును జూడగలయుననుకోరికను చాలకాలమెం

క్కయుత్తరమయినను గొడుకు వ్రాయలేదను కోపముతో నణచిపెట్టియుంచిరి గాని దానినిజంపలేకపోయిరి. రెండుదినములక్రితము రాత్రిపూట "ఎల్లుండిసంవత్సరాదిపండుగ" యనితలంచినవాడయి "అయ్యో, వాళ్లునాతావున నుండకపోయిరి, నేనువాళ్లతావుననయిననుండకపోతిని. ఇంతవువాడుచేసిన తప్పేమిపెద్దది" యని, తన్ను తాను రామయ్య పంతులు నిందించుకొని రూపాయలుపంపి బయలుదేరివచ్చెను.

ఈరోజానతండ్రియు, కొడుకును, కోడలును, వారితల్లియు మృష్టాన్నభోజనము నారగించి సావడిలో దమలపాకులను వేసుకొనుచుండగా నొకటెలిగ్రాము ఒకయుత్తరమును వచ్చినవి.

"ఏబదివేలు గాదు. ఒకలక్షరూపాయలకు ఏర్పాటుచేసినాను రేపు చెన్నపట్నములో నన్నివంగతులు మాటలాడుదును"

కోయంబుత్తూరు, వెంకయ్యర్.

అని టెలిగ్రాములోనున్నది. ఉత్తరములో మామిల్లునందు ఇంజనీయరుగనిని నెలకు 400 రూపాయల జీతము మీద నిచ్చితిమి. వారముదినములలో ప్రవేశింపవలసినది అనిబళ్లారిమిల్లు మేనేజరుగారు వ్రాసియుండిరి. ఈవర్తమానములనంతయువిన్న రామయ్యపంతులుగారు మనమదృష్టవంతులమే. ఒకశుభముపయిన మరియొకశుభమువచ్చుచున్నదని యనిరి. అక్కడకూడియున్న నలుగురుబిడ్డలలో పెద్దది యగు త్రివేణిఅన్నిటికంటె పెద్దయదృష్టమెద్దియని తనతోబుట్టువులను ప్రశ్నించెను. వారెవ్వరును తాతయ్య వచ్చుటయే యనిరి. కారణముండకపోలేదు. మనరామయ్యపంతులుగారు వీరికయిదలముగా మిఠాయిలను దెచ్చిపెట్టుటచే బిడ్డలకు తాతగారియం దాదరణమును హెచ్చుచేసినది.

మరునాడుదయమున వెంకటయ్యరు వచ్చెను. అందరునుచేరి బళ్లారికివెళ్లుదమా, వ్యాపారమారంభించెదమా యని విచారించిరి. జానకమ్మగారు వ్యాపారమనిరి. రామయ్యపంతులుగారు బళ్లారివెళ్లుట మంచిదనిరి. తుదకువ్యాపారముచేయుటకే నిశ్చయింపబడెను. లక్షరూపాయలపెట్టుబడితోననేకయంత్రములుచేయబడియెను. పత్రికలలో ప్రకటనములు బాగుగా జేయబడియెను. మొదటిసంవత్సరమునందు 12 లక్షలరూపాయల యంత్రములమ్మబడియెను. పదిసంవత్సరములలో నారాయణరావుగారు లక్షలార్జించిరి. ఇంకను అర్జించుచున్నారు. వెంకయ్యరు నారాయణరావుగారికి ముఖ్యమేనేజరయి నెలకువెయ్యి రూపాయలజీతముపుచ్చుకొనుచు స్వామిభక్తిగలిగి, పరిశుద్ధప్రవర్తనముగలవాడయి యున్నాడు. నారాయణరావుగారికి ధనముతీసుకొనిరాగల సౌఖ్యములెట్టివయినను వాటికిప్పుడు కొఱతలేదు. జానకమ్మగారేమయిన మారిపోయినదా? ఎంతమాత్రమునుకాదు. ఆమెపూర్వపు పతిభక్తి, దైవభక్తిగల జానకమ్మగారే. ధనముపుష్కలముగానుండుటచేత మహాదాతయనిగూడ చెన్నపట్టణమంతటను పేర్వాసిగాంచినది. నిరంతరమీమెగృహము అన్నపూర్ణాదేవికి నిలయము. మరినలుగురు బిడ్డలనుగని అష్టయిశ్వర్యములతోను జానకమ్మగారు తులదూగుచున్నది. అనేకపర్యాయములు సాయంకాలపువేళ మేడమీదగూర్చుండి తమపూర్వజీవితమునుగురించి భార్యాభర్తలు మాటలాడుకొనుచుండగా నన్నిసంపదలకును గారణరాలవు నీవేయనిభర్త జానకిని యభినందించుచుండును. మీపరిశ్రమా ఫలితమిదియని భార్యయనుచుండును. నీవాఱుసంవత్సరములు సర్వకష్టములకు నోర్చుకొని యుండకపోయినయెడల నానిర్మాణముగతి ఏమయియుండునోయని భర్తమాఱుపల్కును. భార్యను బెనిమిటిని స్వర్గములోనికి దీసుకొనివెళ్లుటకయినను, లేకనరకములోనికి బడద్రోయుటకయినను మహాశక్తికలదని అనేకమంది స్నేహితులతో నారాయణరావుగారెల్లప్పుడనుచుందురు. తమవద్దకేయాచనకు సహాయనిమిత్తమయి వచ్చినను నిరంతరకృషి, భగవదనుగ్రహమునకు శాంతముతో గాచుకొనియుండుట యివిరెండును మీకు కావలసినవియని నారాయణరావుగారు పలుకుచుందురు.

అమృతాంజనము. అన్నినొప్పులకు సిద్ధామృతము.

వెల ౮ అణాలుమాత్రమే. ఫోర్టు, బొంబాయి.